RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్
సంపుటి : 3, సంచిక : 78

మంగళవారం
ఫిబ్రవరి 11, 2025

పేజీలు : 4
వెల : రూ.3-00

www.vedhanews.in

విలేకరులు కావలెను

ప్రజా సమస్యల పరిష్కారమే మా ఎజెండా..ఇంత కాలం మేము ప్రచురించిన కథనాలే అందుకు ఉదాహరణ.. నిజమైన, నిఖార్సైన జర్నలిజానికి వేదికగా నిలుస్తున్న 'వేద న్యూస్' తెలుగు దినపత్రికలో నిజాలు రాసి నిఖార్సైన జర్నలిస్టుగా రాణించాలనుకునే వారికి ఇదే మా ఆహ్వానం..

9701923260, 9701920379

# రామ రాజ్యం పేరుతో రావణ రాజ్యం చేస్తామంటే..

# ఊరుకోం..

- హిందూ ధర్మం ఎన్నో నదులను తనలో కలుపుకునే మహాసముద్రం వంటిది
- ఎంతో ప్రాచీనమైన హిందూ ధర్మాన్ని ఆచరించే ప్రజల్లో ఎవరి నమ్మకాలు వారివి
- అర్చకులు రంగరాజన్ పై దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టం
- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ







**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

హిందూధర్మం ఎన్నో నదులను తనలో కలుపుకునే మహాసముద్రం వంటిదని, అదే హిందూ ధర్మం గొప్పతనమని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. రామరాజ్యం పేరుతో తెలంగాణ రాష్ట్రంలో అశాంతిని సృష్టిస్తూ రావణ రాజ్యం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని మంత్రి స్పష్టం చేశారు. కొందరు దుండగుల దాడిలో గాయపడి తీవ్ర విచారంలో వున్న చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకులు రంగరాజన్ తో పాటు వారి తండ్రి సౌందర రాజన్ ను సోమవారం మంత్రి సురేఖ వారి నివాసానికి వెళ్ళి పరామర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారికి అన్నివేళలా అండగా వుంటుందని మంత్రి వారి కుటుంబానికి భరోసానిచ్చారు. సీఎస్ రంగరాజన్ పై జరిగిన దాడిని మంత్రి సురేఖ తీవ్రంగా ఖండించారు. సంఘవ్యతిరేక శక్తులు తమ స్వప్రయోజనాల కోసం రాముని పేరుతో రాజకీయాలు చేస్తూ, ప్రశాంతంగా సాగుతున్న తెలంగాణ సమాజాన్ని అశాంతికి గురిచేసే చర్యలను ఉక్కుపాదంతో అణచివేస్తామని తేల్చి చెప్పారు. ఎంతో ప్రాచీనమైన హిందూ ధర్మంలో ఎవరి నమ్మకాలు వారివని, తమ నమ్మకాలను ఇతరుల పై రుద్దడం వారి స్వేచ్ఛను హరించడమేనని మంత్రి అన్నారు. తన జీవిత పర్యంతం ధర్మానికే కట్టుబడి జీవించిన శ్రీరాముని పేరుతో హింసకు పాల్పడటం విచారకరమని అన్నారు. ఈ దాడికి కారకులైన వారిని చట్టబద్ధంగా శిక్షిస్తామని తేల్చి చెప్పారు. భవిష్యత్ లో ఇలాంటి చర్యలకు పాల్పడితే తీవ్ర చర్యలుంటాయని మంత్రి సురేఖ హెచ్చరించారు.

## దాతల సాయం కోసం ఎదురుచూపులు

- ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న ఫ్యామిలీ
- బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆస్పత్రిలో మహిళకు చికిత్స
- వైద్యానికి ఆపన్నహస్తం అందించాలని వేడుకోలు

**వేద న్యూస్, కరీంనగర్:**



జమ్మికుంట పట్టణం లోని కేశవపూర్ శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయం పాఠశాల లో 1999 నుంచి 2012 వరకు తెలుగు ఆచార్యుడిగా పని చేసిన వేదుల రామకృష్ణరావు తన సతీమణికి వైద్యం చేయించడానికి ఆర్థిక స్థోమత లేక దీనావస్థను ఎదుర్కొంటున్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. రామ కృష్ణరావు సతీమణి లక్ష్మికి 2019లో స్వైన్‌ఫ్లూకు గురయ్యారు. ఆమె ఊపిరితిత్తులు చాలా వరకు అప్పుడే దెబ్బతిన్నాయి. 2022లో ఆమెకు బ్రెయిన్ స్ట్రోక్ రావడం వల్ల పెరాలసిస్ వచ్చింది. 2024 జూలైలో మొదటి వారంలో షుగర్ లెవెల్స్ పడిపోయి స్పృహ కోల్పోయారు. పక్షవాతం వల్ల ఆమె మంచానికే పరిమితమయ్యారు. 2019 నుంచి ఆమె ఆరోగ్యం కోసం కుటుంబ సభ్యులు ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. టీచర్‌గా ఎందరో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువుకు సాయం చేసేందుకు తోచినంతలో దాతలు ముందుకు రావాలని పలువురు కోరుతున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న తన భార్య లక్ష్మి ట్రీట్‌మెంట్‌కు సాయం చేయాలని రామకృష్ణారావు విజ్ఞప్తి చేస్తున్నారు. దాతలు స్పందించి 98481 37155 నంబర్‌కు ఫోన్ పే ద్వారా తోచినంతలో సాయం చేయాలని రిక్వెస్టు చేస్తున్నారు.

## ఆహార భద్రత నిబంధనలను పకడ్బందీగా అమలుచేయాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వేద న్యూస్, వరంగల్ :**



జిల్లాలో ఆహార భద్రత నిబంధనలను పకడ్బందీగా అమలుచేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. వరంగల్ కలెక్టరేట్ లో సోమవారం ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అదనపు కలెక్టర్ సంధ్యారాణితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తుల పై పరీక్షలు నిర్వహించడం, అలాగే వ్యాపారాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడం, ఆహార పదార్థాలతో వ్యాపారాలు చేసేవారు నిబంధనలకు లోబడి ఆహార భద్రత ప్రమాణాలను పాటించాలని సూచించారు. ఆహార పదార్థాల తయారీ, విక్రయ కేంద్రాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. ఆహార భద్రత ప్రమాణాలకు అనుగుణంగా లేని వ్యాపారాలకు లైసెన్సులు రద్దు చేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు ఆహార భదత నిబంధనల గురించి ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు అందించే ఆహారం పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైనది తయారు చేసి విద్యార్థులకు అందించాలని, తప్పనిసరిగా ఉపాధ్యాయులు భోజనం చేసి ఆహార నాణ్యతను పరీక్షించాలని చెప్పారు. అంగన్వాడీల్లో, అందించే పౌష్టికాహారం, పాలు, గుడ్లు తదితరవి, ప్రభుత్వ పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఆహార వ్యాపారం చేసే ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఆహార భద్రత ప్రమాణాలను పాటిస్తున్నారో లేదో తనిఖీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఫుడ్ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి, డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివరావు, డీఎస్ డిఓ కిష్టయ్య, జిల్లా పరిశ్రమల అధికారి సాలమాన్ రాజు, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి తదితరులు పాల్గొన్నారు.



## బల్దియా ప్రజావాణిలో 75 ఫిర్యాదులు

**వేద న్యూస్, మట్వాడ:**

ప్రజల వినతులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని బల్దియా కమిషనర్ డా. అశ్విని తానాజీ వాకడే అన్నారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో గ్రీవెన్స్ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుండి వినతులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సిఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, హెచ్‌ఓలు రమేష్, లక్ష్మారెడ్డి బయాలజిస్ట్ మాధవ రెడ్డి, ఇన్చార్జి సి పి రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## అర్చకులు రంగరాజన్‌కు సీఎం ఫోన్

- దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం
- దాడి కేసులో ఆరుగురి అరెస్ట్..!

**వేద న్యూస్, డెస్క్:**



చిలుకూరి బాలాజీ ప్రధాన అర్చకులు రంగరాజన్ దాడి ఘటనపై తాజాగా సీఎం రేవంత్ రెడ్డితో సహా పలువురు స్పందించారు. సీఎం స్వయంగా ఫోన్ చేసి రంగరాజన్‌ను పరామర్శించారు. ఈ ఘటన గురించి ఆరా తీసిన సీఎం, దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ పరిధిలోని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ పై దాడి ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయనపై రెండు రోజుల క్రితం దాడి జరిగినట్లు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. రంగరాజన్ ఇంట్లో ఉన్న సమయంలో 20 మంది వచ్చి దాడి చేసినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామని, అన్ని విషయాలు విచారణలో తెలుస్తాయని రంగరాజన్ చెప్పారు. తనపై జరిగిన దాడి గురించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపిన ఆయన ఈ ఘటనపై పూర్తి వివరాలు చెప్పడానికి నిరాకరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఫిబ్రవరి 07న కొంత మంది వ్యక్తులు రంగరాజన్ నివాసానికి వెళ్లారు. రామరాజ్యం స్థాపనకు మద్దతు ఇవ్వాలని కోరగా ఆయన దానికి నిరాకరించారు. న్యాయపరంగా ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. దీంతో వాగ్వాదానికి దిగి ఆయనపై దాడి చేశారు. అడ్డుకునేందుకు వచ్చిన ఆయన కుమారుడిపై కూడా దాడి చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇప్పటికే ఆరుగురుని అరెస్ట్

మిగతా 4వ పేజీలో..

# అన్నదాత సేద్యానికి అడ్డంకులు!

కరీంనగర్ :కరీంనగర్ గ్రామీణ మండలంలోని ఎస్సారెస్పీ డి-94 కాలువ ఆయకట్టు రైతులు వానకాలం, యాసంగి పంటలకు సరైన నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వలో నాచు పేరుకుపోవడంతో నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. నాలుగేళ్లుగా ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని చెబుతున్నారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ నుంచి వచ్చే డి-94 కాలువ రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి మీదుగా వెళ్తోంది. కరీంనగర్ గ్రామీణ మండల పరిధిలో 5,293 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది. అయితే రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి వద్ద మురుగు నీరు నేరుగా ఈ కాల్వలోకి చేరుతోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. పైపెచ్చు కాల్వలో నాచు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి. ఎక్కువ మోతాదులో నీటిని విడుదల చేస్తే సీతారాంపూర్, రేకుర్తి వద్ద కాల్వ కట్టలు తెగిపోతున్నాయి. రైతులు ఎస్సారెస్పీ అధికారులకు మొరపెట్టుకున్నా నగరపాలక సంస్థ తీరుతో సమస్య పరిష్కారం కనుచూపుమేరలో కానరావటం లేదు. ప్రస్తుత వానకాలంలో కాల్వనీటి ఆధారంగా, వర్షాధారంగా పలు గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు వేశారు. బావులు, బోర్లు లేని పంటలు ఎడే పరిస్థితి పలు గ్రామాల్లో నెలకొంది. గతంలో కాల్వ నీటిని పరిశీలించిన ఎస్సారెస్పీ అధికారులు నగరపాలక సంస్థ మురుగు నీటిని ఎస్సారెస్పీ కాలువలోకి విడుదల చేయడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి సమస్య తాత్కాలిక పరిష్కారం కోసం కాల్వలో పేరుకుపోయిన నాచును తొలగించాలని సూచించారు. నాచును



తొలగించటానికి నగర పాలక సంస్థ టెండర్లు పిలిచింది. రూ.4.85 లక్షలతో వ్యర్థాల తొలగింపు పనులు ప్రారంభించారు. వేరేశాఖ పనులను నగరపాలక సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఎలా చేస్తుందని విమర్శలు రావటంతో ప్రారంభించిన మరుసటి రోజే టెండర్ రద్దు చేసుకొని పనులను నిలిపివేశారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో నగరపాలక సంస్థ మురుగునీటిని ఎస్సారెస్పీ కాలువలోకి విడవడం, వ్యర్థాలు తొలగిస్తామని చెప్పి మళ్లీ రద్దు చేసుకోవటంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ కాల్వలో వ్యర్థాలు తొలగించటానికి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. మరుసటి రోజే టెండరు రద్దు చేసుకున్నట్లు తెలిసింది. కాలువలోకి మురుగు నీరు విడుదల చేయడంతో ఆయకట్టు పంటలకు సక్రమంగా నీరందటం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం.

# కూపన్‌లు, లక్కీ డ్రాలతో నయా దందా..?

సిరిసిల్ల:వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో దసరా ధమాక పేరుతో 'రూ.100 కొట్టు మేకను పట్టు' అంటూ జిల్లా ప్రజలకు బంపర్ ఆఫర్ స్కీంను రూపొందించామని ప్రచారం చేసుకున్నారు. మరొకరు రూ.100లతో ఒక కూపన్ కొంటే మద్యం, కోడి, మేకలను లక్కీ డ్రాలో గెలుచుకోవచ్చంటూ పథకాన్ని తీసుకొచ్చారు. వీటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని వ్యాపార కేంద్రాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. నెల రోజుల క్రితం వేములవాడ పట్టణంలో వాహన, గృహోపకరణాల కొనుగోలుకు నెల వారీ వాయిదాలతో భాగస్వాములు కావాలని బ్రోచర్ ద్వారా ప్రచారం చేశారు. చేరిన వారికి ఏడాదిలో లక్కీ డ్రా తీసి వారి పేరు తగిలితే నగదు, పలు రకాల వస్తువులు అందిస్తామని అందులో పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాలు ఎక్కువ కావడంతో పోలీసులు దృష్టి సారించారు. వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో కొడుముంజ, వేములవాడ పట్టణాల్లో స్కీంలు, లక్కీ డ్రాల ప్రచారంతో మోసాలకు పాల్పడుతున్న పది మందిపై బుధవారం కేసులు నమోదు చేశారు. జిల్లాలో మూడేళ్ల క్రితం ఒక సంస్థ ఒకేసారి రూ.30 వేలు చెల్లిస్తే ఆరు నెలల తర్వాత నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం లక్ష రూపాయలు మీ సొంతం చేసుకోవచ్చని భారీగా డబ్బులు వసూలు చేసింది. గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని చాలా గ్రామాల్లో చాప కింద నీరులా వ్యాపించింది. డబ్బులు చెల్లించే సమయానికి రేపుమాపు అంటూ కాలం వెళ్లదీశారు. చివరికి తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. వారిపై




కేసులు నమోదైనా కట్టిన డబ్బులు మాత్రం రాలేదు. రూ.5 లక్షలకు రెండు పడక గదుల ఇల్లు నిర్మించి ఇస్తామని ఓ స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో ప్రచారం చేసింది. ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. వీరి మాటలు నమ్మి చాలా మంది డబ్బులు కట్టారు. కొన్ని చోట్ల నిర్మాణాలు కూడా ప్రారంభించారు. దీంతో కొందరైతే పాత ఇళ్లను కూల్చివేసుకుని కొత్త ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. కొన్ని నెలలకు సంస్థ నిర్వాహకులు, వారి కింద పని చేసేవారు గ్రామం విడిచి వెళ్లారు. రూ.లక్షల్లో డబ్బులు చెల్లించిన వారు లబోదిబోమంటూ మధ్యవర్తులను ఆశ్రయించారు. వారు కూడా చేతులెత్తేయడంతో పలువురు ఆత్మహత్యకు యత్నించారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి సంస్థ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

# ఆహారభద్రతపై ఆశలు



పెద్దపల్లి : ప్రజాప్రతినిధుల అభిప్రాయం తీసుకుంటాం. వచ్చే నెల నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తాం. - మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి వ్యాఖ్యలు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు కొలమానం చేశారు. రేషన్‌కార్డు లేకపోవడంతో అభివృద్ధి ఫలాలకు అర్హులైన పేదలు దూరమవుతున్నారు. ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు మిథ్యగా మారింది. కొత్త రేషన్‌కార్డుల జారీపై మంత్రివర్గ ఉపసంఘం స్పష్టత ఇచ్చింది. వచ్చే నెలలో కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొనడంతో పేద వర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మంత్రి వర్గ ఉపసంఘంలో కొత్త రేషన్‌కార్డుల విధి విధానాల కూర్పు తుది దశకు చేరింది. పరిమితికి లోబడి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేపట్టారు. కొత్త రేషన్‌కార్డు క్యూఆర్ కోడ్/మైక్రో చిప్/బార్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డు ఉంటుంది. ఆదాయ, ఇతరత్రా అర్హతలపై చర్చలు కొనసాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా కొత్తగా రేషన్‌కార్డుల మంజూరు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గత కొద్ది రోజులుగా ఉపసంఘం పలు మార్లు భేటీ అయ్యింది. మార్గదర్శకాలపై కూలంకషంగా చర్చించారు. ఈనెల 19న ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుని 21న మరోసారి సమావేశం చేపట్టనున్నారు. వచ్చే నెలలో కొత్తగా దరఖాస్తులు స్వీకరించి వడబోత చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో 12,411 పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి. ఎట్టకేలకు లబ్ధిదారుల నిరీక్షణకు తెర పడనుంది. రేషన్‌కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు నెలల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 28 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం చాలా మం ది దొడ్డు బియ్యాన్ని తినడంలేదు. పలువురు బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దళారులు బియ్యాన్ని కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

# ఆటుపోట్లను తట్టుకుంటూ వరి కోతలు షురూ!



ఎల్లారెడ్డిపేట:వానాకాలం సీజన్‌లో ఆటుపోట్లను తట్టుకుంటూ వ్యవసాయం చేసిన అన్నదాతలు వరి కోతలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రారంభించారు. పంట ఏపుగా పెరగడం, ఆరోగ్యంగా ఉండటంతో దిగుబడిపై భారీ ఆశలు పెట్టుకున్నారు. సాగునీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరి పంటను రైతులు సీజన్ ప్రారంభంలోనే సాగు చేశారు. వరి పంట చేతికందుతుండగా వర్షాలు విరామమివ్వడంతో కోతలను ఆరంభించారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూరు, గూడెం తదితర గ్రామాలతోపాటు గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, చందుర్తి, రుద్రంగి తదితర మండలాల్లో వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. జిల్లాలో సుమారు 4.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సంబంధిత శాఖల అధికారులతో ఇటీవల సమీక్షాసమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది. 258 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వరి పంట కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం సేకరణకు జిల్లాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ పరిధిలో 44, మిగతా శాఖల కింద 12 కలుపుకొని మొత్తం 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జిల్లా మొత్తంగా ధాన్యం దిగుబడిలో 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానుందని అంచనా వేశారు. అవసరమైతే కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు. కేంద్రాల ఏర్పాటుతోపాటు వాటిలో కనీస సౌకర్యాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. 7,777 టార్పాలిన్లు, 766 తూకం వేసే యంత్రాలు, 634 ప్యాడీ క్లీనర్లు, 603 తేమశాతం చూసే యంత్రాలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి. తాలు, తప్ప లేకుండా ధాన్యాన్ని శుద్ధి చేసి, తేమశాతం 17 ఉండేలా చూసుకొని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచిస్తున్నారు.

# కరుణించిన కాలం.. ఉబికివచ్చిన జలం

కరీంనగర్:వానాకాలం ఆరంభంలో ఆశించిన వర్షాలు కురవక అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. ఈసారి సాధారణం కంటే తక్కువగానే కురుస్తాయోమోనని ఆవేదన చెందుతున్న తరుణంలో కాలం కరుణించింది. జులై, సెప్టెంబరు నెలల్లో దంచికొట్టిన వానలతో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఈ సారి జిల్లాలో 37 శాతం అధికంగా వర్షం కురిసింది. భూగర్భ జలాలు పైకి ఉబికివస్తున్నాయి. గత మూడు నెలల్లో నీటిమట్టం తగ్గినప్పటికీ సెప్టెంబరులో పెరగడంతో యాసంగి పంటల సాగు అవసరాలకు భరోసా కలిగింది. ఈ ఏడాది జులైలో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవడంతో జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటల్లోకి నీరు చేరి వాగులు ఉప్పొంగాయి. చెరువుల మత్తళ్లు దూకాయి. వరద కాలువలో నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. జిల్లాలో నాలుగు నెలల్లో కలిపి 748.9 మి.మీ సాధారణం కాగా 1025 మి.మీ వర్షం కురిసింది. ఈ వానాకాలంలో 3.34 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. జలాశయాలన్నీ నిండుగా నీరుండడంతో ఆయకట్టు ప్రాంతమైన జిల్లాలో భూగర్భ జలాలు పైకివచ్చాయి. పంటలకు



సమాంతరంగా వ్యవసాయ బావుల నుంచి నీరు జారుతోంది. జిల్లాలో ప్రతి నెలా 33 ఫిజోమీటర్ల ద్వారా నీటి లెక్కలు తీస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 3.31 మీటర్ల లోతుకు నీటి మట్టం ఉబికివచ్చింది. గతేడాది సెప్టెంబరు నెలలో 3.40 మీటర్ల లోతులో నీరుంది. అత్యల్పం గా మానకొండూరు మండలంలో 1.36 మీటర్ల లోతులో నీరుండగా అత్యధికంగా గంగాధర మండలంలో 7.27 మీటర్ల లోతులో ఉంది. గత నాలుగు నెలల గణాంకాలు పరిశీలిస్తే భూగర్భ జలమట్టం రెట్టింపు స్థాయికి పెరిగింది.

# బిల్లులు రావు..భవనాలు పూర్తికావు!

మెట్‌పల్లి:మెట్‌పల్లి మండలం కేసీఆర్ తండాలో నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనమిది. తలుపుల బిగింపు, ఫ్లోరింగ్, రంగులు వేయడం తది తర పనులు మిగిలిపోయాయి. బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. నూతనంగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం గతంలో పాఠశాల భవనంలో కొనసాగగా ప్రస్తుతం మహిళా సంఘం భవనంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. సమా వేశాల నిర్వహణ, రికార్డులు భద్రపర్చడానికి అటు అధికారులు ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలనకు కీలకమైన గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు కరవయ్యాయి. సమస్యల పరిష్కారం, సమావేశాలు, రికార్డుల నిర్వహణ, అభివృద్ధి పనులు ఇలా అన్నీ ఇక్కడి నుంచే నిర్వహించాల్సి ఉంటుంది. పాలనకు కీలకమైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పలుచోట్ల పనులు ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో వేగం తగ్గింది. మరికొన్ని చోట్ల ఇతర కారణాలతో పనులు మొదలవలేదు. జిల్లాలో కొత్త పంచాయతీలతో పాటు భవనాలు శిథిలావస్థకు చేరిన చోట పాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అద్దె, కమ్యూనిటీ, పాఠశాల, మహిళా సంఘాల భవనాల్లో కొనసాగుతుండటంతో గ్రామసభలు, సమావేశాల నిర్వహణ, రికార్డులు భద్రపర్చడం కష్టంగా మారింది. సుమారు రెండేళ్ల కిందట కొత్త పంచాయతీలతో పాటు భవనాలు



శిథిలావస్థకు చేరిన గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు దశల వారీగా నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారు. పనులు మొదలై కొన్ని చోట్ల పూర్తయ్యాయి. చాలా చోట్ల పనులను అసంపూర్తిగా వదిలేశారు. సకాలంలో బిల్లులు రావడం లేదని, వడ్డీకి డబ్బులు తెచ్చి భవనాలు నిర్మించామని గుత్తేదారులు వాపోతున్నారు. బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయోనన్న అనుమానంతో పనులు చేయడానికి విముఖత చూపుతున్నారు. కొన్ని పంచాయతీ భవనాలు స్థల సమస్య, ఇతర కారణాలతో నేటికి పనులు ప్రారంభం కాలేదు.

# మిల్లుల్లో రేషన్ బియ్యం దందా!

# చోద్యం చూస్తున్న అధికారులు?



వేములవాడ : పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కొంత మంది అక్రమార్కులు రైస్ మిల్లులు కేంద్రంగా ఈ దందాను కొనసాగిస్తున్నారు. వేములవాడ పట్టణం పరిసరాలు, గ్రామీణ మండలం మర్రిపల్లి ప్రాంతంలోని కొన్ని మిల్లుల నిర్వాహకులు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంత మంది గ్రామాల్లో తిరుగుతూ సేకరించిన వాటిని మిల్లర్లకు విక్రయిస్తున్నారు. వీరి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఇతరులకు కిలో రూ.20 నుంచి రూ.25లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ ఏ శాఖ అధికారులు మిల్లులను తనిఖీ చేసి ఈ అక్రమాలను అరికట్టిన దాఖలాలు లేవు. దీంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతోంది. రైస్ మిల్లులు, రేషన్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. దీంతో పలు రైస్ మిల్లుల్లో ఈ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి. ఒక వేళ తనిఖీ చేసినా పట్టుబడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కొందరు ఫిర్యాదు చేయడంతో వేములవాడ పట్టణ శివారులోని ఓ రైస్ మిల్లులో జిల్లా పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేశారు. అయినప్పటికీ ఈ తతంగం కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఆలయ అభివృద్ధి దిశగా అడుగులు

సిరిసిల్ల: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజన్న ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రానున్నాయి. ప్రసాద్ (తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి) పథకంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని చేర్చనున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ ఈ ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో తుది నిర్ణయం తీసుకుని అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ పథకం కింద ఆలయ పరిసరాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడంతోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తారు. దీనికి ముందు వేములవాడ పురపాలిక మాస్టర్ ప్లాన్-2050 అమలు కావాలి. రెండేళ్ల క్రితమే ప్రారంభించిన ఈ ప్రక్రియ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు ముందే నిలిచిపోయింది. రాజన్న ఆలయం, వేములవాడ పట్టణం అభివృద్ధి రెండూ ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్న అంశాలు. దీనికోసం ఏర్పాటు చేసిన వీటీఏడీఏతో ఆలయ విస్తరణ, అభివృద్ధి,



పర్యాటకంగా తీర్చిదిద్దాల్సిన వాటిపై ఇప్పటికే ప్రణాళికలు రూపొందించారు. ఇది పూర్తిస్థాయిలో అమలు కావాలంటే మాస్టర్‌ప్లాన్ ప్రధానం. దిల్లీకి చెందిన ప్రైవేటు ఏజెన్సీకి సర్వే బాధ్యతలు అప్పగించారు. వీరు డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. భవి ష్యత్తు అవసరాలు తీర్చేలా కొత్త ప్రణాళిక అమలు కానుంది.

# ఆనవాళ్లు కోల్పోతున్న మైసమ్మ గుట్ట

సిరిసిల్ల : ప్రకృతి సంపదను అక్రమార్కులు చెరబట్టారు. ప్రభుత్వ నిర్మాణాలకిచ్చిన తాత్కాలిక అనుమతులను ఆసరాగా చేసుకుని ప్రైవేటు అవసరాలకూ తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన రూ.కోట్ల రాయల్టీకి గండి పడుతోంది. వీటిపై తరచూ జిల్లా రెవెన్యూ, గనుల శాఖలకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తనిఖీలకు వెళ్తే అక్కడెవరూ కనిపించరు. ఇది మరీ విచిత్రమైన పరిస్థితి. జిల్లా కేంద్రానికి సమీపంలో పెద్దూరులోని మైసమ్మ గుట్టకు చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. అక్రమార్కులు వీటిని చెరిపేస్తున్నారు. మానేరు వాగుపై చెక్‌డ్యాంల నిర్మాణం సమయంలో రెండువైపులా కాంక్రీటుతో రక్షణ గోడలు నిర్మించాలి. దీనికి బలం చేకూర్చేందుకు మట్టితో నింపి రాళ్లతో తెట్టును నిర్మించాలి. అప్పుడే చెక్‌డ్యాం వరదలకు కొట్టుకుపోకుండా ఉంటుంది. అయితే చెక్‌డ్యాం తొలి అంచనాల్లో ఈ ప్రతిపాదన లేదు. వరదలకు చెక్‌డ్యాంలు కొట్టుకుపోవడంతో మట్టికట్ట, తెట్టు నిర్మాణ పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. దీనికోసం ఎల్లారెడ్డిపేట మండలం పదిర, వెంకటాపూర్‌లో నిర్మించిన చెక్‌డ్యాంలకు మైసమ్మగుట్టను సగానికిపైగా తొలిచేశారు. ఇప్పుడు మట్టి తవ్వకాల్లో బయటపడిన రాళ్లను తొలుస్తున్నారు. జిల్లాలోని మానేరు పరీవాహక ప్రాంతంలో ఆదిమానవుల జీవనవిధానాలను చరిత్రకారులు కనుగొన్నారు. సిరిసిల్ల శివారులోని బర్కమ్మ, సీతారి గుట్ట ప్రాంతాల్లో పలు రాతి చిత్రాలు వెలుగుచూశాయి. వాటి ఆధారంగా పరిశోధనలు కూడా జరిగాయి. మైసమ్మ గుట్ట పూర్వం వ్యాపార కేంద్రంగా ఉన్నట్లు పరిశోధకులు అధ్యయనాల్లో గుర్తించారు. ఇక్కడ ఉన్న మట్టి ప్రతిమలను గ్రామదేవతలుగా ఇప్పటి కీ కొలిచి పూజలు చేస్తారు. అందుకే దీనికి మైసమ్మ గుట్టగా పేరు వచ్చింది. చరిత్ర పరిశోధకులు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ప్రతిమలు ఎక్కడా చూడలేదని చెబుతున్నారు. ఇవి ఎప్పటివనేది కూడా నిర్ధారణ కాలేదు. పశ్చిమబెంగాల్‌లోని గ్రామాల్లో కొన్ని రూపాలు గ్రామ దేవతలుగా కొలుస్తారని మాత్రం చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని పరిశోధిస్తే మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. అరుదైన చారిత్రక నేపథ్యం ఉన్న ఈ గుట్ట చుట్టూ తవ్వకాలతో ఆనవాళ్లు కోల్పోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.



# ముంబయి పోలీసుల పేరుతో వైద్యుడికి బెదిరింపు

ధర్మవరం:ముంబయి పోలీసుల పేరుతో ధర్మవరం పట్టణానికి చెందిన వైద్యుడు సూర్యనారాయణరెడ్డిని వాట్సప్ వీడియో కాల్ ద్వారా బెదిరించి రూ.33 లక్షలు ఖాతాలో జమ చేయించుకున్న ఐదుగురు సైబర్ నేరగాళ్లను ధర్మవరం 1వ పట్టణ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను ఎస్పీ వి.రత్న వెల్లడించారు. గతనెల 18వ తేదీన వైద్యుడు సూర్యనారాయణరెడ్డికి ముంబయి పోలీసునంటూ ఒకవ్యక్తి వాట్సప్ వీడియోకాల్ చేశాడు. నరేష్ గోయల్ అనేవ్యక్తి కెనరాబ్యాంకు ద్వారా రూ.500 కోట్లు అప్పుగా తీసుకున్నాడని, డబ్బులు సంస్థకు వాడకుండా వివిధ ఖాతాల్లో జమ చేశాడని.. అందులో మీ ఖాతా కూడా ఉందని చెప్పాడు. రూ.20 లక్షలు కమీషన్ తీసుకున్నారంటూ వాట్సప్ వీడియోకాల్‌లో వైద్యుడిని బెదిరించాడు. రూ.33 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని, లేదంటే అరెస్టు చేసి ముంబయికి తీసుకువెళతామని హెచ్చరించాడు. దీంతో ఆందోళనకు గురైన వైద్యుడు రూ.20 లక్షలు ఒకసారి, రూ.13 లక్షలు మరోసారి మొత్తం రూ.33 లక్షలు సైబర్ నేరగాళ్లు ఇచ్చిన బ్యాంకు ఖాతాకు జమ చేశారు. హైదరాబాద్‌కు చెందిన మంగమద్దెల ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో ఉన్న ఖాతాలో నిధులు జమయ్యాయి. ఇంకా డబ్బు ఇవ్వాలని తరచూ వాట్సప్ వీడియో కాల్ చేస్తూ బెదిరిస్తుండటంతో వైద్యుడు ధర్మవరం 1వ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ తిమ్మారెడ్డి, ఆర్ఎస్ఐ వెంకటేశ్వరరావు, ధర్మవరం 1వ పట్టణ పోలీసులతో ఎస్పీ ఒక బృందాన్ని



ఏర్పాటు చేశారు. వారి దర్యాప్తులో ఐదుగురు సైబర్ నేరస్థులు పట్టుబడ్డారు. అరెస్టయిన వారిలో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన దాసి ఇలియాజర్, నంద్యాల జిల్లాకు చెందిన మంగమద్దెల ప్రహ్లాద్, నంద్యాల వెంకటాచలం కాలనీకి చెందిన అల్లు అంబిరెడ్డి, కర్నూలు జిల్లా ఆళ్లగడ్డకు చెందిన బెలగడ కిశోర్, బాపట్ల జిల్లా చెరకుపల్లి మండలం గూడవల్లికి చెందిన జావీద్ ఉన్నారు. దాసి ఇలియాజర్, జావీద్ బీ.టెక్ వరకు చదివి ప్రైవేట్ సంస్థల్లో పనిచేస్తున్నారని ఎస్పీ తెలిపారు. వైద్యుడిని ముంబయి పోలీసు పేరుతో బెదిరించిన వ్యక్తిని అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వైద్యుడి నుంచి జమ చేయించుకున్న రూ.33 లక్షలు రికవరీ చేసే యత్నంలో ఉన్నట్లు ఎస్పీ వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎ.శ్రీనివాసులు, ధర్మవరం డీఎస్పీ టి.శ్రీనివాసులు, 1వ పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్, సైబర్ క్రైమ్ సీఐ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ గ్రేడుల్లో గందరగోళం

నరసరావుపేట: రొంపిచర్ల మండలం తురిమెళ్ల జనాభా 1560 ఉండగా దానిని ఇటీవల అధికారులు గ్రేడ్ వన్ పంచాయతీగా, ఇదే మండలంలోని వి.రెడ్డిపాలెం పంచాయతీ పరిధిలో సుమారు 5,500 మంది జనాభా ఉంటారు. దానిని అధికారులు గ్రేడ్-4 పంచాయతీగా ప్రకటించారు. జనాభా, ఆదాయం అనుసరించి జిల్లాలోని గ్రామ పంచాయతీల గ్రేడ్లను మార్చినట్లు ప్రకటించారు. అయితే ఇష్టానుసారంగా అధికారులు ప్రకటించడంపై గ్రామ పంచాయతీల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నాయనడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే. జిల్లాలో జనాభా, ఆదాయ వనరుల ఆధారంగా పంచాయతీలకు గ్రేడ్లు కేటాయించారు. అయితే అర్హత ఉన్నా గానీ చాలా పంచాయతీలు గ్రేడ్-1 హోదా సాధించలేకపోయాయి. చాలా పంచాయతీలకు గ్రేడ్-1 స్థాయి ఉన్నప్పటికి గ్రేడ్-2, 3, 4, 5లో ఎక్కువ పంచాయతీలు ఉన్నాయి. గ తంలో మైనర్ పంచాయతీలు రెండు, మూడు కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి వాటిల్లో పెద్ద పంచాయతీకి గ్రేడ్ వన్ కల్పించి ఒక కార్యదర్శిని నియమించారు. 2011లో ఈ పంచాయతీల హోదాలను అధికారులు తారుమారు చేశారు. గ్రేడ్-5 పంచాయతీలను గ్రేడ్-3, 4లో కలిపేశారు. క్లస్టర్‌గా ఏర్పడిన మైనర్ పంచాయతీలను విడగొట్టారే గాని వాటిల్లో ఒక గ్రామానికి ఉన్న గ్రేడ్-1 హోదాను మాత్రం తొలగించలేదు. ఫలితంగా చాలా మైనర్ పంచాయతీలు గ్రేడ్-1 హోదాలో కొనసాగడం విశేషం. మేజర్ పంచాయతీలు ఆ హోదాను కోల్పోయాయి. నరసరావుపేట మండలం పరిధిలో గ్రేడ్ వన్ హోదా



ఒక రావిపాడు పంచాయతీకి మాత్రమే దక్కింది. జనాభా, ఆదాయపరంగా పెద్ద గ్రామాలైన యల్లమంద, ఇసప్పాలెం, కేశానుపల్లి, జొన్నలగడ్డ తదితర గ్రామాలు గ్రేడ్-3 హోదా కల్పించారు. ఉన్న శావల్యాపురం, ఈపూరు, బెల్లంకొండ, ముప్పాళ్ల తదితర పంచాయతీలకు గ్రేడ్ వన్ హోదా తీసి వేసి గ్రేడ్-3, 4 హోదా కల్పించారు. శావల్యాపురానికి గ్రేడ్-4 హోదా కల్పించడం గమనార్హం. ఇప్పటికైనా పంచాయతీ ఉన్నతాధికారులు జరిగిన తప్పు లను చక్కదిద్ది అర్హతలను బట్టి గ్రేడ్లను కేటాయించాలని గ్రామీణులు కోరు తున్నారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీలకు గ్రేడ్ల కేటాయింపు ఉమ్మడి జిల్లా కేంద్రంగా ఉన్న గుంటూరులో జరిగిందని తప్పులు ఉంటే పరిశీలిస్తామన్నారు.

# ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాల్సిందే..



జిల్లా సచివాలయం: ఆయకట్టు కింద ఉన్న ప్రతి ఎకరాకు నీరు ఇవ్వాలి. ప్రతి ఇంజినీరు క్షేత్ర స్థాయిలో తిరగాలి. సరఫరా వ్యవహారంలో అన్నదాతలను నష్టపరచాలని చూస్తే ఉపేక్షించే ప్రసక్తే ఉండదు'..అని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. అనంత కలెక్టరేట్లో కలెక్టర్ వినోద్‌కుమార్ అధ్యక్షతన జిల్లా సాగునీటి సలహా మండలి(ఐఏబీ) సమావేశం జరిగింది. తొలుత హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ నీటి వాటా, ఏయే కాలువకు ఎన్ని టీఎంసీలు కేటాయించారన్న దానిపై వివరించారు. తర్వాత మంత్రి కేశవ్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో నీటి ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతులకు పైసా ఇవ్వలేదు. గత ప్రభుత్వ తప్పిదాలను తప్పు పట్టే మనస్తత్వం కాదు మాది. కొత్త ప్రాజెక్టుల నిర్మాణం దేవుడెరుగు.. ఉన్న ప్రాజెక్టుల నిర్వహణ, మరమ్మతుల కోసం నిధులు సమకూరుస్తామని మంత్రి అన్నారు. ప్రణాళిక ప్రకారం సరఫరా ప్రక్రియ కొనసాగిస్తే చివరి భూములకు నీరు ఇవ్వవచ్చు. రానున్న మూడు మాసాలు అధికారులు కష్టపడాలి. ఇంజినీర్లు అందరూ కలిసి వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసుకుని నీటి నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. హెచ్చెల్సీ నీటి నిర్వహణపై దృష్టి సారించి పని చేయాలని మంత్రి కేశవ్ అన్నారు. హంద్రీనీవా, ఇతరాత్ర ప్రాజెక్టులపై లోతుగా చర్చించేందుకు ఈనెల 22, 23న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు వస్తున్నారు. 22న అనంతలోనే ఉంటారు. అవసరమైతే 23న మరొకసారి చర్చిద్దామన్నారు. రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నీటి ప్రాధాన్యం బాగా తెలుసు. తన నియోజకవర్గ పరిధిలో పీఏబీఆర్ కుడి కాలువ ఉంది. నీరు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అన్నదాతలకు అండగా ఉండటానికి అందరూ కృషి చేయాలి. కేంద్ర పథకాల కోసం నిధులు తేవడానికి తాను బాధ్యత తీసుకుంటానన్నారు. జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, గుమ్మనూరు జయరాం, బండారు శ్రావణిశ్రీ, అస్మిత్‌రెడ్డి, దగ్గుపాటి ప్రసాద్, ఎస్పీ జగదీశ్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, జలవనరుల శాఖ సీఈ నాగరాజు, ఎస్ఈలు రాజశేఖర్, దేసేనాయక్, విశ్వనాథ్‌రెడ్డి, ఆర్డీఓలు రాణి సుస్మిత, వసంతబాబు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా నుంచి మంత్రి సత్యకుమార్ యాదవ్ మినహా తక్కినవారు హాజరు కాలేదు. ఆహ్వానం పంపలేదన్న చర్చ సాగుతోంది. పొరుగున ఉన్న ఆలూరు, పులివెందుల ఎమ్మెల్యేలు, కడప ఎంపీ సైతం గైర్హాజరయ్యారు. ఎన్ని జలాలు వస్తాయి. ఏయే ప్రాంతాలు, జలాశయాలకు ఎన్ని కేటాయించాలి.. వంటి అంశాల ప్రస్తావనే లేదు.

# మట్టి అక్రమ తవ్వకాలు నిజమే?



అమరావతి:వైకాపా పాలనలో మట్టిమాఫియా రెచ్చిపోయింది. అధికారమే అండగా అడ్డగోలు తవ్వకాలు చేసి అక్రమార్జనకు పాల్పడ్డారు. పర్యావరణానికి తూట్లు పొడిచి సొంత జేబులు నింపుకున్నారు. స్థానికులు ఆందోళన చేసినా..అధికారులు అడ్డుకున్నా అక్రమ తవ్వకాలు మాత్రం ఆగలేదు. 2019లో వైకాపా అధికారంలోకి రావడంతోనే చేబ్రోలు మండలంలో అక్రమ తవ్వకాలు మొదలయ్యాయి. నాణ్యమైన గ్రావెల్ లభిస్తుండడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు ప్రాంతాలకు ఇక్కడి నుంచి మట్టి తరలించారు. నియోజకవర్గ నేత అండదండలతో ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేశారు. గోరంత అనుమతులు తీసుకుని కొండంత తవ్వకాలు చేశారు. రూ.కోట్ల జరిమానాలు వేస్తున్నా వెరవక అక్రమ తవ్వకాలు సాగించారంటే అక్రమార్కులు ఏస్థాయిలో ఆర్జన చేశారో వారికే తెలియాలి. ఇక్కడి నుంచి గ్రావెల్ తరలించి రూ.వందల కోట్లు సొమ్ము చేసుకున్నారు. ఈ ఏడాది జనవరిలో అప్పటి మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ మట్టి తవ్వకాలపై ఫిర్యాదు చేయడంతో వైకాపా ప్రభుత్వంలోనే అధికారుల బృందం తనిఖీలు చేసి నివేదిక ఇచ్చింది. వీరనాయకునిపాలెం, శేకూరు గ్రామాల పరిధిలో 2020 నుంచి 2022 డిసెంబరు వరకు మూడేళ్ల వ్యవధిలో జరిగిన తవ్వకాలను పరిశీలిస్తేనే లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి అక్రమంగా తవ్వి తరలించినట్లు అధికారుల బృందం గుర్తించింది. రెండు గ్రామాల్లోనే ఈస్థాయిలో అక్రమ తవ్వకాలు జరిగితే వడ్లమూడి, శలపాడు, సుద్ధపల్లి తదితర ప్రాంతాల్లో ఎంతస్థాయిలో అక్రమాలు జరిగాయో నిగ్గు తేల్చాల్సి ఉంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో చేబ్రోలు మండలంలో గత అయిదేళ్లలో జరిగిన మట్టి తవ్వకాలపై సమగ్ర విచారణ చేస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశంఉంది. వీరనాయకునిపాలెం,శేకూరు గ్రామాల్లో భూగర్భగనుల శాఖ నుంచి అనుమతి తీసుకుని నలుగురు తవ్వకాలు చేశారు. వీరంతా శేకూరులోనే అనుమతులు తీసుకున్నారు. 2020 నుంచి 2022 డిసెంబరు వరకు 22 మందికి తాత్కాలిక ప్రాతిపదికన అను మతులు ఇచ్చారు. తాత్కాలిక అనుమతుల ద్వారా 1,81,521 క్యూబిక్ మీటర్లు గ్రావెల్ తవ్వారు. ఇందుకు రూ.90,26,440 వసూలు చేశారు. 2019 నుంచి 2022 మధ్య అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించే వారి నుంచి రూ.1.10 కోట్ల జరిమానా భూగర్భగనుల శాఖ వసూలు చేసింది.

# పురంలో కుంటుపడిన పాలన

హిందూపురం : పారిశుద్ధ్యం పడకేయడంతో మురుగు కాలువల శుభ్రతకు నూతన ప్రభుత్వం రూ.1.3 కోట్లు మంజూరు చేసింది. వాటికి టెండర్లు పిలిచారు. గుత్తేదారుకు పనులు అప్పగించాలంటే కౌన్సిల్ ఆమోదం తప్పని సరి. ఇంటింటికీ నీటి సరఫరా కోసం నూతన పైప్‌లైన్ ఏర్పాటు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం కోసం నూతన ప్రభుత్వం రూ.120 కోట్ల మంజూరుకు అంగీకరించింది. సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసి, పంపించాలని ఆదేశించింది. ఈ ప్రణాళిక తయారీని నిపుణులతో చేయించాలి. ప్రణాళిక తయారీకి కౌన్సిల్ ఆమోదం అవసరం. మున్సిపల్ పాలనను నడిపించడానికి ప్రతి నెలా కౌన్సిల్ సమావేశం నిర్వహణ తప్పని సరి. హిందూపురంలో ఎన్నికల కారణంగా మార్చి నెల నుంచి జూన్ వరకు సమావేశం జరగలేదు. జులైట్కులో జరిగినా వైకాపా సభ్యుల మెజార్టీ ఉండటంతో అధికారులు ప్రతిపాదించిన పనులను అడ్డుకొన్నారు. ఆగస్టులో ఛైర్‌పర్సన్ పదవి నుంచి తప్పుకోవడంతో, రాజీనామా ఆమోదానికి మాత్రమే సమావేశం పరిమితమైంది. నూతన ఛైర్మన్ ఎన్నిక తరువాత సమావేశం నిర్వహించాలని అధికారులు భావించారు. అయితే ఎన్నిక నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయకపోవడంతో ఛైర్మన్ ఎన్నిక ఆలస్యం అవుతోంది. వైస్ ఛైర్మన్ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించడానికి అవకాశం ఉంది. అయితే సమావేశ నిర్వహణకు ఎవరూ చొరవ తీసుకోవడం లేదు. దీంతో నడిపించే వారు లేక మున్సిపల్ పాలన కుంటుపడింది. సమావేశం జరపాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు వచ్చినా, ఇటీవల వైకాపా నుంచి తెదేపాలో చేరిన కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతున్నారు. వైకాపాకు చెందిన వైస్ ఛైర్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహణకు వారు అంగీకరించడం లేదని తెలుస్తోంది. రాజకీయ విభేదాల కారణంగా పట్టణ ప్రగతికి అడ్డంకులు ఎదురవుతున్నాయి. గొల్లపల్లి నుంచి పట్టణానికి నీటిని తీసుకొచ్చే




తాగునీటి పథకంలో పంపుహౌస్‌ల వద్ద మోటార్లు, నియంత్రికలు సరిగా పని చేయడం లేదు. ఇన్‌టెక్ వెల్ వద్ద, మరో రెండు పంపు హౌస్‌లలో ఒకే ఒక్క మోటారు పని చేస్తున్నాయి. అవి ఏ క్షణమైనా నిలిచిపోవచ్చు. తాగునీటి పథకానికి అత్యవసరంగా మరమ్మతులు చేయించాల్సి ఉంది. ఈ పనుల కోసం గత ప్రభుత్వ హయాంలోనే 8 నెలల క్రితమే రూ.2 కోట్లు కేటాయించి, టెండర్లు పిలిచారు. అయితే సొంత పార్టీ కౌన్సిలర్లే అడ్డుకోవడంతో గుత్తేదారులకు పనులు కేటాయించలేదు. కౌన్సిల్ సమావేశంలో మెజార్టీ సభ్యులు ఆమోదం తెలిపితే, వెంటనే మరమ్మతుల పనులు చేయవచ్చు. పలు కాలనీల్లో మురుగు కాలువలు, చిన్నచిన్న రోడ్లు నిర్మించాల్సి ఉంది. ఈ పనులకు టెండర్లు పిలవాలంటే కౌన్సిల్ అనుమతి కావాలి. ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వచ్చినా, రాకపోయినా ఈ నెలలో కౌన్సిల్ సమావేశం తప్పని సరిగా నిర్వహిస్తాం. ఎన్నిక జరగకపోతే, వైస్ ఛైర్మన్ అధ్యక్షతన సమావేశం జరుగుతుంది. అభివృద్ధి పనులు, నిర్వహణ పనులకు కౌన్సిల్ ఆమోదం తీసుకొంటాం.

# నేతన్నలకు ఆధునిక శిక్షణ

మంగళగిరి:మారుతున్న సమాజానికి తగ్గట్టుగా నూతన డిజైన్లు ఉత్పత్తికి అవసరమైన శిక్షణ నేతన్నలకు ఇచ్చి వారు తయారు చేసిన వస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించనున్నట్లు చేనేత జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. మంగళగిరిలో మంత్రి లోకేశ్ ఏర్పాటు చేసిన చేనేత వీవర్స్ శాలను పరిశీలించారు.కార్మికులకు లభిస్తున్న ఆదాయం, ఉత్పత్తి చేస్తున్న చేనేత వస్త్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ నేతన్నలు తన కుటుంబ సభ్యులని వారి అభివృద్ధికి తోడ్పాటును అందించాలని మంత్రి లోకేశ్ తనకు చెప్పినట్లు వివరించారు. నూతన డిజైన్లపై శిక్షణ ఇవ్వడంతో పాటు మంత్రి లోకేశ్ ఉపాధి కల్పిస్తున్నారన్నారు. గతంలో తెదేపా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలన్నీ తిరిగి అమల్లోకి తెస్తామన్నారు. దసరా పండగ దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో చేనేత వస్త్ర విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వర్షాల కారణంగా నష్టపోయిన చేనేత కార్మిక కుటుంబాలకు రూ.25 వేలు పరిహారం, నూలు కోసం అదనంగా మరో రూ.5 వేలు అందజేస్తామన్నారు. వీవర్స్ సర్వీసు సెంటర్ల ద్వారా 6 వేల మందికి, 5302 నూతన డిజైన్లు రూపొందించి శిక్షణ ఇచ్చామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 375 శిక్షణ తరగతులు నిర్వ



హించామన్నారు. చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, అడిషనల్ డైరెక్టర్ శ్రీకాంత్ ప్రభాకర్, తెదేపా నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్ధయ్య, నాయకులు జానకీదేవి, దామర్ల రాజు, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు

# డిసెంబరులో రాజధాని పనులు ప్రారంభిస్తాం



మంగళగిరి,:రాజధాని పరిధిలోని 29 గ్రామాలను సమానంగా అభివృద్ధి చేస్తామని, త్వరలో అన్ని పనులు ప్రారంభమవు తాయని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. నిడమర్రు, కురగల్లు గ్రామాలకు చెందిన 10 మంది రైతులు 17 ఎకరాల భూమిని రాజధాని అవసరాలకోసం స్వచ్ఛందంగా భూ సమీకరణకు ముందు కొచ్చి అంగీకార పత్రాలను అందించారు. మంత్రి నారాయణ ఆ పత్రాలను స్వీకరించి సీఆర్డీఏ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 360 కి.మీ. రోడ్లు, సుమారు 3 వేల అంతర్గత రోడ్లు, అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం భవనాలు, అసెంబ్లీ, హైకోర్టు తదితర నిర్మాణ పనులను డిసెంబరులో ప్రారంభిస్తామన్నారు. '29 గ్రామాల్లో మూడు వేల ఎకరాలు ఇంకా భూ సమీకరణకు రావాల్సి ఉంది. కొంతమంది రైతులు ప్రస్తుతం భూములిచ్చేందుకు తమను సంప్రదిస్తున్నార'ని తెలిపారు. రైతులు ఎవ రు ముందుకొస్తారో మిగిలిన ప్లాట్లలో వారికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. రైతు సోదరులు ఎంతోమంది ముందుకొస్తున్నా రన్నారు. కురగల్లు, నిడమర్రు, తుళ్లూరు మండలం రాయపూడిలో 21 ఎకరాలు రైతులు ఇచ్చారన్నారు. నిర్మాణాలను నిపుణులు పరి శీలించి ఇబ్బంది లేదన్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టులను రద్దుచేసి మళ్లీ టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ సీఆర్డీఏ అధికారులు చేపట్టారని వెల్లడించారు. సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సాయిసూర్య ప్రవీణ్‌చంద్, డిప్యూటీ కలెక్టర్ భీమారావు, తహసీల్దార్ ఆంజనేయులు, ఉప తహసీల్దార్ శ్రీనివాసరావు, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.5 కోట్లకుపైగా కొబ్బరి బకాయిలు



అంబాజీపేట: నాఫెడ్ కొబ్బరి కొనుగోలు కేంద్రంలో కొబ్బరిని విక్రయించిన రైతులు తమకు రావాల్సిన డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ కేంద్రంలో కొబ్బరిని విక్రయించిన 21 రోజుల్లోనే నగదు రైతుల వ్యక్తిగత ఖాతాల్లో జమకావాల్సి ఉంది. నిర్దేశించిన సమయం దాటిపోవడంతో డబ్బుల కోసం వేచి చూస్తున్నారు. అంబాజీపేట, కొత్తపేటలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి... కర్షకుల నుంచి కొబ్బరి కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు వీరికి సంబంధిత నగదు రాలేదు. ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీ నుంచి అంబాజీపేటలోను, అనంతరం కొత్తపేటలోనూ రైతుల నుంచి సేకరించారు. ఆయా కేంద్రాల్లో సుమారు 203 మంది రైతులు సరకు విక్రయించారు. వారంతా బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ కాకపోవడంతో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. నాఫెడ్ కేంద్రంలో కొబ్బరి విక్రయించిన రైతులకు క్వింటాకు రూ.11,160 చొప్పున చెల్లించాల్సి ఉంది.అంబాజీపేట కొనుగోలు కేంద్రంలో 50 కిలోల చొపున 3,835 సంచుల కొబ్బరి కొనుగోలు చేశారు.

కొత్తపేట కేంద్రంలో 5,679 సంచుల కొబ్బరిని కొనుగోలు చేశారు.ఆయా కేంద్రాల్లో మొత్తం 4,757 క్వింటాళ్ల కొబ్బరి రైతుల నుంచి కొనుగోలు చేశారు. అంబాజీపేట, కొత్తపేట నాఫెడ్ కొనుగోలు కేంద్రాల నుంచి రైతులకు ఇప్పటి వరకు రూ.5,30,88,120 రావాల్సి ఉంది. ఈ కేంద్రాలు ప్రారంభించిన తొలి రోజుల్లో కొబ్బరిని విక్రయించిన రైతులకు కూడా ఇప్పటి వరకు నగదు జమకాకపోవటం విశేషం. త్వరగా తమ డబ్బులు జమచేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

# మత్తు నియంత్రణకు మార్గం ఏదీ ?

ఉమ్మడి జిల్లాలో తరచూ గంజాయి పట్టుబడుతోండటం ఆందోళన కలిగిస్తోంది. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి రోడ్డు, రైలు మార్గానా మహమ్మారి ఇక్కడికి చేరుతోంది. గత 8 నెలల వ్యవధిలోనే ఎక్సైజ్, పోలీసు అధికారులు కిలోల కొద్ది గంజాయిని పట్టుకోవటాన్ని గమనిస్తే దందా ఏ మేరకు సాగుతుందో అర్థమవుతోంది. మరోవైపు గంజాయికి గ్రామీణ యువత, విద్యార్థులు బానిసలుగా మారుతుండటం ఆందోళన కలిగిస్తున్న విషయం. అనారోగ్యానికి గురవుతామని తెలిసిన వారు మత్తు వీడటం లేదు. ఎక్కువగా నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి వినియోగిస్తున్నారు. స్థానికులు, ఇతర రాష్ట్రాల వారు ఇక్కడికి రైల్వే మార్గంలో గుట్టుచప్పుడు కాకుండా గంజాయి రవాణా చేస్తున్నారు. రామగుండం, పెద్దపల్లి, ఓదెల, పొత్కపల్లి, బిజిగిరిషరీఫ్, జమ్మికుంట రైల్వేస్టేషన్లు మహారాష్ట్ర, ఒడిశా, ఏపీ రాష్ట్రాలకు అనుసంధానంగా ఉండటంతోఅక్కడి నుంచి గంజాయి ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చేరుతోంది. రోడ్డు మార్గంలో రవాణా చేస్తూ కూడా నిందితులు పట్టుబడ్డ దాఖలాలు ఉన్నాయి. జమ్మికుంట రైల్వేస్టేషన్ వద్ద ఓ మహిళ 400 గ్రాముల గంజాయితో స్థానిక ఆబ్కారీ పోలీసులకు పట్టుబడింది.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన యువిజ్ఞ

**వేద న్యూస్, కాజీపేట :**



కాజీపేట ఫాతిమా నగర్‌లోని మాన్ ఫోర్ట్ స్కూల్ (సిబిఎస్)లో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎడ్ల యువిజ్ఞ జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ గోపు విన్సెంట్ రెడ్డి తెలిపారు. పాఠశాలలో సోమవారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్ 14 సాఫ్ట్ బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన యువిజ్ఞను అభినందిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 13 నుంచి 16వ తేదీ వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో ఈ జాతీయ స్థాయి పోటీలను నిర్వహించనున్నారని తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన యువిజ్ఞను ఆ పాఠశాల ప్రిన్సిపల్ తో పాటు తెలంగాణ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పి సాంబశివరావు, హనుమకొండ జిల్లా సాఫ్ట్బాల్ అసోసియేషన్ సెక్రెటరీ తాబేటి రాజేందర్, కోశాధికారి వి. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పెరుమాండ్ల సాంబమూర్తి, పాఠశాల పీఈటి అంతోని, తల్లిదండ్రులు ఎడ్ల రమేష్, సుమలత, సోదరుడు ఎడ్ల వినీల్ రాజ్ అభినందించారు.



## ఘనంగా రాఘవారెడ్డి జన్మదిన వేడుకలు

**వేద న్యూస్, కాజీపేట :**

వరంగల్ పశ్చిమ నియోజకవర్గం, కాజీపేట చౌరస్తాలో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి 60వ జన్మదిన వేడుకలను కాజిపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చించు చంద్రయ్య, గుర్రపు కోటేశ్వర్, బోయిన కుమార్ యాదవ్, రణధీర్ రెడ్డి, 47వ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ సందెల విజయ్ కుమార్, మహిళా నాయకురాలు మద్దెల శోభారాణి, వస్కుల శీను, రావుల ఇమ్మడి బాబు, విద్యాసాగర్, కసర్ల నాగేష్, గంగుల రాజిరెడ్డి, సత్యవరం మధుకర్, అశోక్, మహమూద్, చోటు, మహేందర్ రెడ్డి, దేవేందర్, సురేందర్, యూత్ నాయకుడు దాస్, ప్రేమ్, అఖిల్, మున్నా, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, జంగా అభిమానులు పాల్గొన్నారు.




## అక్రమ కేసులకు భయపడేది లేదు

- మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ పసుల రాంమూర్తి

**వేద న్యూస్, గోదావరిఖని :**

గోదావరిఖని 1టౌన్ పోలీస్ స్టేషన్‌లో మంద కృష్ణ మాదిగను బెదిరించినాని 28/25 కేసు నమోదు చేయడం బావ్యం కాదు అని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ పసుల రాంమూర్తి అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంకు ఎవరు తూట్లు పొడిచిన ఊరుకోమన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టిన భయపడేది లేదు అన్నారు. కేసు సంబందించి ఎస్ఐ రమేష్ ను కలిసి నోటీసులు తీసుకున్నామారు. వర్గీకరణకు వ్యతిరేకం కోసం ప్రాణలైన ఇస్తాం వర్గీకరణను అడ్డుకుంటమన్నారు. తప్పుడు కేసులు పెట్టిన మాజీ ఎమ్మెల్యే నిజనిజాలు తెలుసుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు జూపక సుదీర్, జిల్లా అధ్యక్షులు డా దేవి లక్ష్మి, నర్సయ్య, రాష్ట్ర కార్యదర్శి మధుబాబు, రాష్ట్ర మహిళ వర్కింగ్ ప్రెసిడెంట్ గంట బబిత తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దుద్దిళ్ల కు వినతి పత్రం

- ఉప్పల్ మండల ఏర్పాటుకు సహకరించాలని కోరిన జేఏసీ నాయకులు

**వేద న్యూస్, కమలాపూర్ :**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామాన్ని కొత్త మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ హుజురాబాద్ నియోజ కవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ (ఇన్ఫర్మేషన్ & టెక్నాలజీ) శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును ఉప్పల్ మండల జేఏసీ నాయకులు కలిసి ఉప్పల్ మండలం ఏర్పాటుకు సహకారం అందించాలని ఈ సందర్భంగా వినతి పత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అయిన ధనసరి సీతక్కను కలసి ఉప్పల్ ను మండలం గా చేయడానికి కావలసిన అన్ని అర్హతలు ఉన్నాయని, కాబట్టి వెంటనే ఉప్పల్ ను కొత్త మండలం గా ఏర్పాటు చేయాలని మంత్రి సీతక్క కు కూడా వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పల్ మండల జేఏసీ నాయకులు మాట్లాడుతూ హుజరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో ఇద్దరు మంత్రులను కలిసి వారికి ఉప్పల్ మండలం గా ఏర్పాటు చేయుటకు సహకారం అందించాలని కోరామని అందుకు వారు సానుకూలంగా స్పందించారని జేఏసీ నాయకులు తెలిపారు.

# కులగణన అత్యంత పారదర్శకంగా జరిగింది

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**వేద న్యూస్, శాయంపేట :**



భూపాలపల్లి నియోజకవర్గం శాయంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణ అవగాహన ర్యాలీ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యేకు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రి నుండి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీగా చేరుకున్నారు. అంబేద్కర్ సెంటర్ లో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ కి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే అత్యంత పారదర్శకంగా జరిగిందన్నారు. కులగణన సర్వేను మళ్లీ చేయాలన్న కేటీఆర్ వ్యాఖ్యలను యావత్ బీసీ సమాజం అస్సలు క్షమించదని ఎమ్మెల్యే అన్నారు. పదేళ్ల క్రితం సమగ్ర కుటుంబ సర్వే చేసి కనీసం ఆ లెక్కలను కూడా సమాజానికి చెప్పలేని, ఇప్పుడు కేటీఆర్ కులగణన సర్వేను మళ్లీ చేయాలని మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన ఏడాది కాలంలోనే ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు వస్తుంటే చూసి భరించలేకే కేటీఆర్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఎంతో శాస్త్రీయంగా ప్రభుత్వ సిబ్బందితో ఇంటింటికి తిప్పి పరిశీలించి మరీ వివరాలు సేకరించినట్లు తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లను ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధ్యమైనంత మేరకు ఎక్కువ స్థానాలు ఏకగ్రీవం అయ్యేలా కృషి చేయాలని నేతలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు గ్రామాలలో కలిసికట్టుగా పనిచేయాలని, వర్గాలుగా విడిపోయి గ్రామాలల్లో ఇబ్బందికర పరిస్థితులను సృష్టిస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల అద్యక్షుడు దూదిపాల బుచ్చి రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారాపెల్లి రవీందర్,రాష్ట మిమీమం వేజ్ బోర్డు మేంబర్ బాసానీ చంద్ర ప్రకాష్, నాయకులూ చల్లా చక్రపాణి, చింతల రవి పాల్,దుబాసి కృష్ణ మూర్తి, కొమ్ముల భాస్కర్, రాజు, ఐఎన్ టీయూసీ అద్యక్షుడు మారా పెల్లి రాజేందర్ పాల్గొన్నారు.

# అధికారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలి

**వేద న్యూస్, మహబూబాబాద్:**



సొసైటీ చట్టం ప్రకారం సహకార సంఘం కార్యవర్గం ఆమోదం తెలుపకుండా లోపాయిక ఒప్పందంతో మత్స శాఖాధికారులు ఇచ్చిన సభ్యత్వాలు తక్షణమే రద్దు చేసి అధికారులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఎంసిపీ ఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మత్స్య శాఖ అధికారి వీరన్నని కలిసి మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గడ్డం నాగార్జున మాట్లాడుతూ కాట్రపల్లి ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు 1982 సంవత్సరంలో 48 మందితో రిజిస్ట్రేషన్ (ఎం-333) చేసుకోవడం జరిగింది. అప్పటి నుండి నేటి వరకు వారి ఆధీనంలోనే సొసైటీ ఆరోగ్యకరమైన వాతావరణంలో నడుస్తుంది. కానీ మత్స్యశాఖ అధికారులు పక్క గ్రామమైన భవాని గడ్డ తండా శివశంకర్ నగర్ ఆవాసంలో నివసిస్తున్న 30 మంది ముదిరాజ్ కుటుంబాలకు సభ్యత్వము ఇవ్వడం జరిగిందని ఆరోపించారు. సొసైటీ చట్టం ప్రకారం సహకార సంఘం కార్యవర్గం ఆమోదం తెలుపకుండా లోపాయిక ఒప్పందంతో మత్స శాఖాధికారులు ఇచ్చిన సభ్యత్వాలు తక్షణమే రద్దు చేసి అధికారులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఎంసిపీ ఐ(యు) రాష్ట్ర కమిటీ సభ్యులు గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. తీసుకొని ఆ ఓటర్ జాబితాలో ఉన్నటువంటి వేరే గ్రామ ప్రజల్ని తొలగించాలన్నారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరిక జారీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం గ్రామ ఉపాధ్యక్షులు గడ్డం ఉప్పలయ్య, కుల పెద్దమనిషి గడ్డం భద్రయ్య ,ఎదురబోయినా యాకయ్య సంఘ సభ్యులు దబ్బాటీ సూరయ్యా, గడ్డం బాలకృష్ణ చేలకపల్లి మల్లేష్ మొలకల సోములు దబ్బటి వెంకన్న, దబ్బటి యాకయ్య యటగాని శ్రీనివాస్, గడ్డం నర్సయ్య యటగాని రాములు ఎదురబోయిన చిన్న సూరయ్య చేలకలపల్లి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**వేద న్యూస్, ములుగు :**

ములుగు జిల్లా మల్లంపల్లి మండలం మల్లంపల్లి గ్రామంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సుమారు రెండు దశాబ్దాల కిందట తాము చదువుకున్న పాఠశాలలో ఒకే వేదికపై కలుసుకోవాలన్న ఆలోచనతో గత వారం రోజుల నుంచే పూర్వ విద్యార్థులు ప్రణాళిక రూపొందించుకొని సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్య బోధించిన గురువులకు మెమొంటోలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. బాల్యంలో తాము చదువుకున్న పాఠశాలలో తీపి గుర్తులను గుర్తు చేసుకున్నారు. అప్పటి బాల్య స్నేహితులు తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన పలువురు పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతగానో ఆనందాన్ని ఇచ్చిందని తమ ఉపన్యాసాలలో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పాఠశాలలో చదివిన తోటి విద్యార్థి మరణించిన స్వామి కుటుంబానికి తమ వంతు కృషిగా ఆర్థిక సహాయం అందించిన పరిపూర్ణ చారి, సునీల్, సతీష్, పాపరావులను ఉపాధ్యాయులు అభినంధించినరు. ఈ సమ్మేళనం కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, మరియు 70 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్చకులు రంగరాజన్‌కు

# సీఎం ఫోన్

మొదటి పేజీ తరువాయి

చేసినట్లు రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రధాన నిందితుడు వీరరాఘవరెడ్డి సహా మిగతా ఐదుగురుని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసులో అరెస్ట్ చేసిన ఆరుగురిని రిమాండ్‌కు పంపామన్నారు. నిందితులు ఖమ్మం, నిజామాబాద్‌కు చెందిన వారన్నారు. 2022లో వీరరాఘవరెడ్డి 'రామరాజ్యం'ను ప్రారంభించి, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతూ ప్రచారం చేస్తున్నాడు. రామరాజ్యంలో చేరితే రూ. 20వేలు జీతం ఇస్తామని చెప్పాడని డీసీపీ వివరించారు. ఏపీలోని తణుకు, కోటప్పకొండలో వీరరాఘవరెడ్డి పర్యటించి, రామరాజ్యంలో చేరిన వారిని యూనిఫామ్ కుట్టించుకోమ్మని చెప్పాడన్నారు. ఈనెల 6న అందరూ యాప్రాల్‌లో కలుసుకున్నట్లు తెలిపారు. రామరాజ్యం బ్యానర్‌తో ఫోటోలు, వీడియోలు తీసుకుని ఫోటోలు, వీడియోలతో సోషల్ మీడియాలో ప్రచారం చేశారని అన్నారు. ఈ నెల 7న మూడు వాహనాల్లో చిలుకూరుకు 25 మంది నల్ల దుస్తుల్లో వచ్చారని, రామరాజ్యంలో సభ్యుల్ని చేర్పించి తమకు ఆర్థికంగా సాయం చేయాలని రంగరాజన్‌ను డిమాండ్ చేయగా, ఆయన డిమాండ్లకు అంగీకరించలేదని, అందుకే దాడి చేసినట్లు డీసీపీ తెలిపారు.

# హైడ్రాకు మరో కీలక బాధ్యత అప్పగించిన సీఎం రేవంత్

**వేద న్యూస్, హైదరాబాద్ :**

తెలంగాణలో ఇసుక తవ్వకాలు, రవాణాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ఉన్నతాధికారులకు సోమవారం హైదరాబాద్‌లో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సామాన్య వినియోగదారులకు తక్కువ ధరకే ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి పేదలకు ఇసుక అందుబాటులో ఉండేలా పటిష్టమైన చర్యలకు ఉపక్రమించాలని చెప్పారు.

ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇసుక రీచ్‌ల వద్ద తరచూ తనిఖీలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇసుక రవాణా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని ఉన్నతాధికారులకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు.



వీటిని జిల్లాల వారీగా కలెక్టర్లు, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించాలన్నారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే బాధ్యతను హైడ్రాకు అప్పగిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రకటించారు. అలాగే ఇసుక అక్రమ రవాణాపై విజిలెన్స్, ఎన్ ఫోర్స్‌మెంట్ నిఘా ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు.

ఇక ప్రతీ ఇసుక రీచ్‌ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు, సోలార్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టు దిట్టమైన ఫెన్సింగ్‌తో పాటు ఎంట్రీ, ఎగ్జిట్‌లు ఏర్పాటు చేయాలంటూ అధికారులకు సీఎం రేవంత్ కీలక సూచనలు చేశారు. రవాణాకు సంబంధించి రిజిస్టర్డ్ లారీలను ఎంప్యానెల్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు.

ఇసుక బుక్ చేసిన 48 గంటల్లోగా వినియోగదారుడికి చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏరియాల వారీగా సమీప రీచ్‌ల నుంచి వినియోగదారుడికి ఇసుక చేరేలా వ్యవస్థ పటిష్టంగా ఉండాలని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక పోర్టల్ ఏర్పాటు చేయాలని వివరించారు. సమస్య వచ్చిన వెంటనే పరిష్కారం జరిగేలా చూడాలన్నారు. నిర్ణీత ధరకు మాత్రమే ఇసుక అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాకింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాలని అధికారులకు సీఎం సూచించారు. అలాగే ఆన్ లైన్ బుకింగ్ విధానంలో పలు మార్పులకు సంబంధించి సీఎం రేవంత్ ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు.

ఆఫీస్ టైమింగ్స్‌లో బుకింగ్ చేసుకునేలా బుకింగ్ వేళల్లో మార్పు తీసుకు రావాలన్నారు. అక్రమ రవాణాకు సహకరించే అధికారులపై వేటు తప్పదని సీఎం రేవంత్ హెచ్చరించారు. అందులో ఎవ్వరినీ ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. అవసరమైతే తానే స్వయంగా రంగంలోకి దిగి ఆకస్మిక తనిఖీలు చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. పారదర్శకంగా అక్రమాలకు తావు లేకుండా పర్మినెంట్ ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించాలని ఈ సందర్భంగా ఉన్నతాధికారులను సీఎం ఆదేశించారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073